కథ

# ఒకప్పటి స్నేహితులు!

- 'సాహితి'

“చాలాకాలం తర్వాత శ్రీదేవి పిక్చరని ఎంతో హైఎక్స్‌పెక్టేషన్తో వచ్చాను. ఏం బాలేదు సినిమా. ఐనా శ్రీదేవి ఏంటండీ? వెనకటి గ్లామారేలేదు.” థియేటర్లోంచి బైటికొచ్చాక అంది సుజాత.

“శ్రీదేవి గొడవ మనకెందుకుగానీ ఈ దేవి గ్లామర్ మాత్రం రోజు రోజుకీ పెరిగిపోతోంది.” లోగొంతులో ఆమెకి మాత్రమే వినిపించేలా చెణుకు విసిరాడు సంతోష్. పల్చటి సిగ్గుతెర ఆమె ముఖాన్ని కప్పింది.

గేటు దగ్గిర ఆమెని వెయిట్‌చెయ్యమని స్కూటర్ తీసుకురావడానికి వెళ్ళాడు. అతను తిరిగిరాగానే బేక్‌సీట్లో కూర్చుంటూ అంది, “దారేకదా, డాక్టరు దగ్గరకెళ్ళి రిపోర్ట్స్ తీసుకుందాం.”

స్కూటరు దూసుకుపోయింది. చల్లటిగాలి వీస్తోంది.

తుఝె దేఖాతో యే జానా సనం

ప్యార్ హెూతా హై దీవానా సనం

లోవాయిస్‌లో పాడసాగాడు. అతను చాలా బాగా పాడతాడు. అతను పాడుతుంటే వినడం సుజాతకి చాలా యిష్టం. అతనికి దగ్గరగా జరిగి హత్తుకుని భుజం మీద గెడ్డం ఆన్చి వింటోంది.

“డాక్టర్” హన్మకొండచౌరస్తా దాటుతుంటే గుర్తుచేసింది. గుర్తుందన్నట్టు తలూపాడు. ఇంతలో క్లినిక్ వచ్చింది. స్కూటరాపాడు.

పెళ్ళై మూడేళ్ళైంది. ఇంకా పిల్లలు పుట్టలేదని టెస్టులన్నీ చేయించుకున్నారు. స్కానింగ్ చేయించు కోమంది డాక్టరు. దాని రిపోర్ట్ రావాలి.

రాత్రి తొమ్మిది దాటిందిగాబట్టి పేషెంట్సు పెద్దగా లేరు. కాంపౌండరు వెంటనే లోపలికి పంపించాడు. సంతోష్ వెనకాల సుజాతకూడా వెళ్ళబోతుంటే డాక్ట రన్నాడు “మీరు బైటకూర్చోండమ్మా” అని.

ఆమెకీ సంతోష్‌కీ మధ్యగా స్ప్రింగ్‌డోర్ మూసుకు పోయింది.

తనని చూడగానే డాక్టర్ కళ్ళల్లో లీలగా కనిపించిన జాలో ... సానుభూతో... అదేంటో అర్థంకాని భావం ఆమెని చిన్నగా కదిల్చింది.

అప్పుడు మొదలైంది ఆమెలో వుద్విగ్నత! ఏమని వచ్చాయో రిజల్ట్స్? డాక్టరెందుకలా చూసాడు? కుర్చీలో కూర్చుంటూ అస్థిమితంగా అనుకుంది.

కొద్దిసేపటికి వాడిన ముఖంతో సంతోష్ యివతలికొచ్చాడు.

“డాక్టరేమన్నాడు?” సుజాత ఆతృతగా అడిగింది. అతను జవాబివ్వకుండా బైటికి దారితీసాడు. అతన్నను సరించి ఆమె కూడా వెళ్ళింది. ఇంటికి చేరేలోపు నాలుగుసార్లడిగింది ఆ ప్రశ్నని. జవాబు రాబట్టు కోలేకపోయింది.

ఇల్లు చేరగానే స్కూటరు చప్పుడు విని అత్తగారు తలుపుతీసింది. అప్పుడతను ఆవిడేమీ అడక్కుండానే నోరువిప్పాడు.

“డాక్టరు దగ్గిర కెళ్ళొచ్చాం. సుజాతకి యుటరస్‌లో ట్యూమరుందట. యుటరస్ తీసెయ్యాలన్నాడు.”

“అంటే పిల్లలు పుట్టరా?”

“పుట్టరు. ఎప్పటికీ పుట్టరు.” నిరాశో నిస్పృహోగానీ గట్టిగా అన్నాడా మాటల్ని.

ఒక్క క్షణం...

కాళ్ళక్రింది నేల కదుల్తున్నట్టనిపించింది సుజాతకి. గోడ పట్టుకుని గట్టిగా నిలదొక్కుకుంది. క్రమేపీ బాధతెలియడం మొదలైంది.

బాధ...

తనకి యుటరస్‌లో ట్యూమరున్నందుకు కాదు. అందువలన పిల్లలు పుట్టే అవకాశాన్ని కోల్పోయి నందుకు.

తనకి పిల్లలు పుట్టరనే దాన్ని మించినబాధ భర్త ఆ విషయాన్ని తనతో చెప్పి అతని బాధని తన బాధతో కలబోసుకోకుండా తనని వేరుచేసి అది తల్లితో పంచు కోవడం!

గిరుక్కుమని బెడ్రూంలోకెళ్ళి మంచంమీద వాలి పోయింది. కడుపులోంచి దుఃఖం తరుముకొస్తుంటే దిండులో ముఖం దాచుకుంది.

వంటింట్లో గిన్నెల చప్పుడు!

“సుజాతా! అన్నానికి రా.” అత్తగారి పిలుపు.

“నా కొద్దు” దుఃఖభారంతో పూడుకుపోయిన గొంతుతో జవాబిచ్చింది సుజాత. ఆమె నెవరూ బలవంతపెట్టలేదు. ఒక్కడే తినేసి తిన్న వెంటనే బైటికెళ్ళిపోయాడు సంతోష్.

“అలా ఎందుకనుకోవాలి? ఎవర్నేనా పెంచుకుంటే సరి?” అన్నాడు శరత్.

“పెంపా? ఎవరిస్తారు? అందరకీ ఒకళ్ళూ యిద్ద రేగా?”

“ఎవర్నేనా అనాధని?...”

“ఛా... ఛా... అమ్మొప్పుకోదు.”

సంతోష్ మనను అట్టడుగుపొరల్లో వున్న భావమేంటో లీలగా గ్రహించాడు శరత్. అతను తన ప్రాణమిత్రుడే కావచ్చును కానీ సుజాత? తన రక్తం పంచుకు పుట్టిన చె...ల్లె...లు!

అందుకే సంభాషణని డ్రాప్ చేస్తూ “ఇదంత అర్ధరాత్రి శిఖరాగ్ర సమావేశం ఏర్పరిచి అత్యవసరంగా సెటిల్ చెయ్యాల్సిన విషయం కాదనుకుంటాను. సుజా నువ్వూ చర్చించుకుని ఒక నిర్ణయానికి నిదానంగా రండి. దానికి నా పూర్తిమద్దతుంటుంది. అన్నాడు. చిన్నగా నవ్వాడు సంతోష్. డాక్టరు దగ్గిర్నుంచీ వచ్చిందగ్గర్నుంచీ ఒకటే గాభరాగా వుంది నాకు. ఎవర్తోటేనా నా బాధ పంచుకోవాలనిపించింది. నువ్వు తప్ప నాకు ఫ్రెండ్సెం కెవరున్నారు?” అన్నాడు ఆర్తిగా.

శరత్‌కి చెల్లెలు గుర్తొచ్చింది. ఏం చేస్తోందో యిప్పుడు? ఇతనంటే మగవాడు. బాధేస్తోందని అర్ధరాత్రి యింట్లోంచీ బైటపడి తన దగ్గిరకొచ్చేసాడు. కానీ అది? అంత దుఃఖాన్నీ నిద్రరాని రాత్రితో పంచుకుంటూ... ఒంటరితనంతో క్రుంగుతూ ... ఓహ్... తలబలంగా విదిల్చాడు.

* * *

“సుజాకి పిల్లలు పుట్టరట”

అర్ధరాత్రివేళ వురమని మేఘంలా వచ్చి మంచి నిద్రలో తననిలేపి మాట్లాడాల్సిన పనుందంటూ డాబామీదికి లాక్కెళ్ళి అతనన్న ఆ ఒక్క వాక్యంతో శరత్ నిద్రమత్తంతా ఎగిరిపోయింది. విషయమంతా అడిగి తెలుసుకున్నాడు.

“మాకు పిల్లలు పుట్టరంటే ఏదోగా వుంది. తనంటే యింట్లో వుండేమనిషి. నేను బైటికెళ్ళేవాణ్ణి. పిల్లల్లేరట - అని సానుభూతిగా చూస్తారు. పిల్లలుకూడా లేరు, యీ సంపాదనంతా ఏం చేస్తాడోనని కామెంట్‌చేస్తారు. నేనది భరించలేను. అదీగాక.. అనుభవించడానికి ఎవరూ వుండరనుకుంటే ఈ ఆస్థి, యీ వుద్యోగం, ఈ తాపత్రయం యివ్వన్నీ అర్ధరహితంగా అనిపిస్తున్నాయి. లైఫ్ బ్లాంక్‌గా తోస్తోంది.” అన్నాడు సంతోష్. అంతదాకా అతననుభవించిన టెన్షన్, బాధ అలా మాటల్లో వ్యక్తీ కరించుకున్నాక కాస్త వూరట కలిగింది.

“ఇప్పుడింక యింటికేం వెళ్తావు? ఇక్కడే వుండిపో. తెల్లారేక యిద్దరం కలిసి వెళ్దాం.”

“కాదు. నేను వెళ్ళిపోతాను. నువ్వూ అక్కయ్యా వుదయాన్నేరండి.” అంటూ లేచాడు సంతోష్.

అతను యింటికే వెళ్తున్నాడని భావించాడు శరత్. కానీ వాళ్ళిద్దరి దారులూ చీలిపోయి చాలా సేపైందనీ అతని గమ్యం యిప్పుడు తన చెల్లెలు కాదనీ అనుకోలేదు.

* * *

“భలే మనిషమ్మా అతను. ఇప్పటిదాకా మీరిద్దరూ యీ విషయం గురించి మాట్లాడుకోనే లేదా? ఇది మీ భార్యాభర్తలిద్దరికీ సంబంధించిన విషయం.ముందుగా మీరిద్దరూ చర్చించుకుని ఓ నిర్ణయానికొచ్చాక మమ్మల్నే దైనా సలహా అడిగితే చెప్తాం. ఇలా ఇల్లుపట్టకుండా తిరుగుతూ, విషయం నలుగురిముందూ చర్చకి పడేసి, వాళ్ళందరూ తలో విధంగానూ అన్నాక అప్పుడు నిన్ను సంప్రదించడానికొస్తాడా?” కొంచెం కోపంగా అన్నాడు శరత్ . ముందురోజురాత్రి తన దగ్గిరకొచ్చిన సంతోష్

యిప్పటిదాకా యిల్లు చేరలేదంటే అతనికి ఆశ్చర్యం, కోపం రెండూ కలిగాయి.


"అతని మనసులో ఏముందో సరిగ్గా చెప్పడు. ఐనా నేను గ్రహించాననుకో. అతని పరంగా ఆలోచిస్తే అది న్యాయమేకావచ్చు, కానీ నేనెలా సమర్ధించగలను? సుజాతా! ఇలా జరిగినందుకు నాకు చాలా భాధగా వుందే. నాకే అలా వుంటే నీ పరిస్థితి ఎలా వుంటుందో నేను అర్థం చేసుకోగలను. అతనేం చెప్పినా తొందరపడకు ఆవేశపడి పిచ్చిపిచ్చిపనులేం చెయ్యకు." చెల్లెలికెలా ధైర్యం చెప్పాలో అర్థంకావటం లేదతనికి. ఏడ్చిఏడ్చి పీక్కుపోయిన మొహంతో రాత్రంతా అనుభవించిన నిద్రలేమి కళ్ళలో ప్రతిబింబిస్తుంటే... అలాంటి స్థితిలో ఆమెనొదిలేసి వూరుమీద తిరుగుతున్న సంతోష్ మీద క్షణక్షణానికీ కోపం పెరిగిపోతోంది.

ఒక్క అతన్దేనా యీ సమస్య? సుజాతది కాదూ? అతనికింకాపరిష్కారమార్గాలున్నాయి. దీనికసలు ఛాయి సేలేదు. అలాంటిది ఒక్క వోదార్పు మాట చెప్పకుండా ఆమె కర్మానికి అమెనొదిలెయ్యడం వాళ్ల మధ్యనున్న బంధం ఎంత పైపైదో చెప్పకనే చెప్తోంది.

"సుజా! మాతో వస్తావా? రెండురోజులుండి కాస్త కుదుటపడ్డాక వద్దువుగాని." అంది శరత్ భార్య.

"వద్దొదినా. ఇక్కడే వుంటాను. ఇప్పుడురాను." జవాబిచ్చింది సుజాత.

"అధైర్యపడకు ప్రతిసమస్యకీ పరిష్కారం



వుంటుంది." మరోసారి ధైర్యం చెప్పి, వెళ్తామని యిద్దరూ లేచారు. హాల్లో సుజాత అత్తగారు ఎదురైంది. వీళ్ళని చూడగానే ఆవిడ ముఖం అప్రసన్నంగా మారింది.

"బావున్నారా?" పలకరించేడు శరత్ బావోదని. ఆవిడ తిన్నగా జవాబివ్వలేదు. ముందు సన్నగా మూలిగింది. తర్వాత దీర్ఘం తీసింది. ఆ తర్వాత సన్నాయి నొక్కులు నొక్కుతున్నట్టు అంది.

"ఏం బాగులేనాయనా! మా యింటావంటా యిలాంటివి లేవు."

"మా యిట్లో మాత్రం వున్నాయండీ? దీని కర్మ యిలా తగలడిందిగానీ" అన్నాడు శరత్.

ఆవిడ మారుమాట్లాడలేదు. వెళ్తున్నామని చెప్పేసి భార్యాభర్తలిద్దరూ బైట పడ్డారు.

* * *

"నేను చెప్పిన విషయం ఏం చేసావురా? భోజనం కాగానే చెప్పుల్లో కాళ్ళు దూరుస్తున్న సంతోష్ని అడిగింది తల్లి.

వారంరోజుల్నించీ తల్లికీభార్యకీ దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్నాడతను. "ఇంకా ఆలోచించుకోలేదు." తల్లిఇలా నిలదీసినట్టు అడగ్గానే గొణిగాడు.

"అంత ఆలోచనకేముంది? దీనికెలాగా పిల్లలు పుట్టరు. గొడ్రాలిని కట్టుకుని నువ్వూ సంతానహీనుడివని ముద్రవేయించుకుంటావా? మగాడివి. నీకేం ఖర్మరా? నువ్వు చెప్తావా సుజాతకి, నేను చెప్పనా?" కొంచెం గట్టిగానే అడిగిందావిడ.

నిజానికి సంతోష్ తన రెండోపెళ్ళి విషయం భార్యకి చెప్పడానికి తటపటా యిస్తున్నది ఆమె ఫీలింగ్సు హర్టౌతాయని కాదు. ఎన్నో పిక్చర్స్‌లో చూసాడు. ఎన్నో నవలల్లో చదివాడు - ఇలాంటి సందర్భాల్లో స్త్రీయే ముందుపడి భర్తని మరోపెళ్ళి చేసుకొమ్మని వేడుకుంటుందని. తన భార్య అందుకు భిన్నంగా ప్రవర్తి

స్తుందని అతననుకోలేదు. మొదటి ఎత్తు ఆమే వెయ్యాల్సి వున్నప్పుడు తనెందుకు తొందరపడాలని ఆగాడు. తల్లి ముందుకి నెడ్తోంది గాబట్టి యిప్పుడింక ఆగే పని లేదు.

లేచి, చెప్పులలాగే వదిలేసి పడగ్గదిలోకి వెళ్ళాడు. కుర్చీలో ముడిచిపెట్టుకుని కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటోంది సుజాత. చూపులు పుస్తకం మీదా మనసు మరోవిషయం మీదా వున్నాయి. వారం రోజుల్నించీ యింట్లో జరుగుతున్న విషయాలు పరోక్షంలోనే జరుగుతున్నా ఆమెకి తెలుస్తూనే వున్నాయి.

భర్త మరోపెళ్లి చేసుకోవాలనుకుంటున్నాడన్న విషయం విని మొదట ఏడిచింది. అది తనపట్ల ద్రోహంగా అనిపించి గుండెని పుండు సలిపినట్టు సలిపింది. తనలో లోపం వుండి పిల్లలు పుట్టనంతమాత్రాన అతను రెండోపెళ్ళికి సిద్ధపడిపోవాలా? లోకంలో పిల్లల్లేని భార్యాభర్తలు ఎందరు లేరు? తమకి పిల్లలు పుట్టకపోతేనేం? కావాలనుకోవాలేగానీ తల్లిదండ్రుల్లేని పిల్లలెందరు లేరు? అని తర్కించుకుంది.

క్రమేపీ ముందటి వుద్వేగం తగ్గింది. అతనికి పిల్లలు కావాలనుందేమో! వుండదా? కట్టుకున్న భార్యకి పిల్లల్ని కనే అదృష్టం లేనప్పుడు మరోపెళ్ళి తప్పించి మార్గాంతరం ఏముంటుంది? నెమ్మదిగా ఆమె హృదయవైశాల్యం పెరిగింది. అతనొచ్చి అడిగితే తన సుముఖతని తెలియచెయ్యాలనుకుంది.

అదిగో... సరిగ్గా అప్పుడే అతనా గదిలోకి ప్రవేశించాడు. అతనికామె పరాయిదిగా అనిపించింది. ఆమెని అడగాలనుకుంటున్న విషయంచేత అలా అనిపిస్తోంది.

"సుజా!" గొంతు సర్దుకుంటూ పిలిచాడు.

ఆమె దిగ్గున కళ్ళెత్తి చూసింది. ఎంతగా మనసు రాయి చేసుకున్నా కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి. తన కాల్లో ముల్లు గుచ్చుకున్నప్పుడూ, కత్తిపీటతో చెయ్యి తెగినప్పుడూ ఎంతో వూరడినిచ్చిన చేతులు... దగ్గరకి తీసుకుని గుండెలకి చేర్చుకుని వోదార్చిన చేతులు.. యిప్పుడు ముందుకి రావేం? కొంచెం జ్వరం వస్తేనే అల్లల్లాడిపోయిన ఆ వ్యక్తి మొహంలో అపరాధభావనే తప్ప ఆవేదన కనిపించదేం? కన్నీళ్ళ చాటునించి అతని మొహంమసగ్గా కనిపించింది. అరచేత్తో కళ్ళు తడుచుకుని కుర్చీలో సర్దుకుని కూర్చుంది.

"అమ్మ చెప్పింది విన్నావుగా?" దూరంగా నిలబడే అడిగాడు.

"ఊఁ" భారంగా జవాబిచ్చింది.

"నిజానికి నాకే మాత్రం యిష్టం లేదు. అమ్మ బలవంతపెడ్తోంది." మాటలు పేర్చుకుంటూ అన్నాడు.

అతని మాటల్లో కొత్తగా కనిపిస్తున్న హిపోక్రసీకి సుజాత కళ్ళుపెద్దవయ్యాయి.

"ఇలా జరిగిందిగాబట్టి నేను మరో పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను." అని డైరెక్టుగా చెప్పవచ్చు. అతనెంతో లౌక్యంగా అన్నమాటలకి తనేం జవాబివ్వాలి?

"పర్వాలేదు. చేసుకోండి" అనాలా?

"మీదెంత వుదారస్వభావం!" అని పొగడాలా?

"మీ అంత మంచివారు లేరు" అని సర్టిఫై చెయ్యాలా?

ఎంత దయనీయమైనపరిస్థితి తనది! తనకింక జీవితంలో ఏమీ లేదని తెలిసిపోయాక కూడా యింకా తననుంచీ యిలా ఆశించడం!

ఏమీ మాట్లాడలేదు సుజాత.

"నీకు నేనేమీ అన్యాయం చెయ్యను. ఇంట్లో నీ స్థానం నీకే వుంటుంది." అన్నాడతను.

అప్పటిదాకా తమిద్దరిమధ్యనీ పెరిగిన దూరాన్ని మనసు లోనే కొలుస్తున్న సుజాత నిదానంగా వుండడానికి ప్రయత్నం చేస్తూ అంది. "రిపోర్టొచ్చి వారంరోజులైంది. అప్పట్నుంచీ మనం ఒక్కసారిగూడా మాట్లాడుకోలేదు."

"రిపోర్ట్స్ చూసి నేను చాలా అప్సెటయ్యాను."

"ప్లీజ్, నన్ను చెప్పనివ్వండి."

"ఈ పరిస్థితుల్లో ప్రతిమగవాడూ చేసేపనే మీరూ చెయ్యాలనుకున్నారు. సబబే. కాదనను. కానీ మధ్యలో నేనెందుకు."

"... కాదు సుజా!" అతనికి ఆమె ఎప్రోచి



**పద్మలత**

విశాఖపట్నంలో ప్రముఖ నాట్యాచార్యుడు శ్రీ టి.ఎస్. ప్రతాప్ వద్ద కూచిపూడి నాట్యాన్ని అభ్యసించిన పద్మలత విద్యార్థికురాలు. మోహినీ భస్మాసుర, మీరాబాయి నృత్యరూపకాలలో ప్రధాన పాత్రలు పోషించి పలువురి ప్రశంసలు పొందిన పద్మలత, ఆంధ్రప్రదేశ్‌లోనే కాక ఒరిస్సా రాష్ట్రంలోని ప్రధాన నగరాలలోను పలు ప్రదర్శనలు యిచ్చి ప్రశంసలు పొందింది.

- ఎల్. ప్రభాకరరావు

అర్థంకాలేదు. ఏం చెప్పబోతోంది?

అతన్ని వారించిందామె. "నాకూ ఒక మనసుంది. నాకూ బాధగా వుంటుంది. మిమ్మల్నినేను మరోస్త్రీతో పంచుకో లేను. ఐనా... నలుగుర్లో అదెంత అసహ్యంగా వుంటుంది? మీరే ఆలోచించండి."

"నాకు పిల్లలు కావాలి సుజాతా!" తలొంచుకుని అన్నాడు.

"ఎవర్నేనా పెంచుకుందాం." నాలిక చివరిదాకా వచ్చినమాటల్ని మింగేసింది - అని ప్రయోజనం వుండదని. "మీకు నేను అడ్డురాదల్చుకోలేదు. కానీ నేనిక్కడ వుండబోవడం లేదు. నా చేతిలోంచీ జారిపోయినాదాన్ని మరో ఆడపిల్ల అందుకుని నా కళ్ళెదుటే తిరుగుతుంటే చూస్తూ సహించలేను. పోగొట్టుకున్న దానిగురించి అశాంతితో నేను, తను పొందాల్సిన దాన్ని పరిపూర్ణంగా అందుకోకుండా నేను అడ్డంగా వున్నానని ఆమె, మాయిద్దర్లో ఎవరికీ న్యాయం చెయ్యలేక నలిగిపోతూ మీరూ... ఇంత అసహజమైన వాతావరణంలో మీరింతగా కోరుకునే పిల్లలు హెల్దీగా పెరుగుతారా?"

ఒక్కక్షణం వుక్కిరిబిక్కిరయ్యాడు సంతోష్. పాల కోసం చూస్తుంటే పాయసమే దొరికినట్టైంది అతనికి. కానీ లోపల్లో పలెక్కడో లోకభీతి... నలుగురూ ఏమనుకుంటారోనన్న భయం...

"దానంతట అది విడాకులుకావాలంటుంటే మధ్యలో నువ్వేమిటలా మొహం వేళాడేసుకున్నావ్?" అంతా విన్నాక కొడుకుని మరో అడుగుముందుకి నెడ్తూ అంది సుభద్ర.

"నీ నిర్ణయం తప్పేమో మరోసారి ఆలోచించుకో సుజా!" అన్నాడు శరత్.

"అంతకన్నా నాకు ఛాయిస్‌లేదు. దేవుడు నాకన్యాయం చేసాడు. ప్రతిక్షణం దాన్ని నాకు గుర్తుచేసే చోట నేనెందుకుండాలి? నా జీవితం నేను బ్రతుకుతాను." స్థిరంగా జవాబిచ్చింది సుజాత.

ఫలితం... సుజాతకి విడాకులిచ్చాడు సంతోష్.

* * *

సుజాత తండ్రి దగ్గరకి వెళ్లిపోయింది. ప్రైవేటు కాలేజీలో ట్యూటర్‌గా చేరింది. నెలకి రెండువేలొస్తోంది. మొదట్లో సంతోష్ ఆమెకి వుత్తరాలు వ్రాసేవాడు. ఆమె జవాబిచ్చేది కాదు. తర్వాత అతనికి పెళ్ళైంది. కొత్త భార్య, కొత్త జీవితం, కొత్త పరిచయాలు... ఈ ప్రవాహంలో కొట్టుకు పోయాడు.

కాజీపేట స్టేషన్లో నిలబడ్డాడు సంతోష్. భార్య పిల్లల్ని తీసుకుని వేసవిసెలవులకని పుట్టింటికి వెళ్ళింది. వెళ్ళి వాళ్ళని తీసుకురావాలి. ట్రెయిను గంటలేటు. పేపరుకొన్నాడు. చదివేసాడు. అప్పుడే అది పదిచేతులు మారిందికూడా.

అతని దృష్టి దూరంగా నిలబడ్డ యువతి మీద పడింది. సుజాత!

అతన్లో జ్ఞాపకాలఝరి రివ్వుమని లేచింది. గబగబ అటుకేసి అడుగులేసాడు. ఆమె సుజాతే! కూడా ఏడెనిమిదేళ్ళ పాప వుంది. అతన్ని చూడగానే అభిమానంగా నవ్వింది సుజాత.

"బావున్నారా?" తనే ముందు పలకరించింది.

"నువ్వు?"

"చూస్తున్నారుగా, అయాం హేపీ."

"ఈ పాప....?"

"నాపాపే. పెంచుకుంటున్నాను. ఎలా వుంది?ఫోర్త్ చదువుతోంది.పేరు మధు." గలగల అంది.

సంతోష్‌కి ఆమెని చూస్తుంటే ఆశ్చర్యం కలిగింది. ఆమె ఆనందంగా వున్నానంటోంది. తన మటుక్కు తనూ హాయిగానే వున్నాడు. ఆరోజు ఆమె అంత తెగింపైన నిర్ణయం తీసుకోకపోతే యిద్దరూ యిప్పుడిలా వుండగలిగే వారేనా?

ఇంతలో ఆమె ఎక్కవలసిన రైలొచ్చింది. బై చెప్పి ఆమె కదిలింది. రైల్లో కూర్చున్నాక మధు అడిగింది. "ఆయనెవరు మమ్మీ?" అని.

"ఒకప్పటి స్నేహితుడు" జవాబిచ్చింది సుజాత.